సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం ၊ 28 ၊ జనవరి ၊ 2025



సోమశిలలో 67.910 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారానికి 67.910 టీఎంసీలు ఉన్నాయి. 1838 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, దిగువ కాలువలకు 3950 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.82,760
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,530
3 శాతం జీఎస్టీతో	రూ.7,756
సవర (8 గ్రా)	రూ.62,048

గరిష్ఠం/కనిష్ఠం
30.6 /21.4

వాతావరణం

జిల్లాలో మంగళవారం వాతావరణం సాధారణంగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ సోమవారం 68 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

జాతీయ ఆర్చరీ పోటీలకు ఎంపిక



జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లాకు చెందిన ఐదుగురు ఆర్చరీ క్రీడాకారులు ఐదు పతకాలు సాధించి జాతీయ పోటీలకు ఎంపికయ్యారని జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లంరెడ్డి శ్రీహర్ష, పావురాల వేణు సోమవారం తెలిపారు. విజయవాడలో జరిగిన అంతర్ జిల్లాల పోటీల్లో బాలుర రికర్వ్ రౌండ్‌లో కె.తరుణేష్ జోత్య ప్రథమ స్థానం సాధించి బంగారు పతకం, ఆర్ సాయిమౌర్య సిల్వర్ పతకాన్ని సాధించారన్నారు. బాలుర ఇండియన్ రౌండ్‌లో జి.వెంకట లోకేష్ బంగారు పతకాన్ని, ఏ సాత్విక్ బ్రాంజ్ మెడల్‌ని, బాలికల ఇండియన్ రౌండ్‌లో వై.దీత్యాచండిక బ్రాంజ్ మెడల్ సాధించి జాతీయ పోటీలకు ఎంపికయ్యారన్నారు. జాతీయ పోటీలు ఫిబ్రవరి 10 నుంచి 17 వరకు వెస్ట్ బెంగాల్‌లో బోల్‌పూర్‌లో జరుగుతాయని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను కోచ్‌లు శివ శంకర్, భరద్వాజ్, హారతిలు అభినందించారు.

రేపు ఇంటర్ పరీక్షలపై సమన్వయ కమిటీ సమావేశం

నెల్లూరు (టౌన్): ఇంటర్ పరీక్షల నిర్వహణపై ఈ నెల 29న కలెక్టర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఉదయం 11 గంటలకు వివిధ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం జరగనున్నట్లు ఆర్ఐఓ శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం నుంచి స్థానిక స్టోన్‌హౌస్‌పేటలోని కేఏసీ జూనియర్ కళాశాలలో జిల్లాలోని అన్ని యాజమాన్య ప్రిన్సిపల్స్‌తో సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వచ్చే నెల 1, 3వ తేదీల్లో జరగనున్న నైతిక, మానవీయ విలువలు, పర్యావరణ విద్య పరీక్షలతోపాటు 5వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఒకేషనల్ విద్యార్థులు, 10 నుంచి ప్రారంభం కానున్న జనరల్ విద్యార్థుల ప్రాక్టికల్స్ నిర్వహణకు సంబంధించి అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. మార్చి 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి పరీక్ష కేంద్రాల ఖరారు, సిబ్బంది నియామకాలను పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.

హుండీ కానుకలు లెక్కింపు



నెల్లూరు(బృందావనం): ముక్కోటి ఏకాదశి సందర్భంగా రంగనాయకులపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీతల్పగిరి రంగనాథస్వామి వారి దేవస్థానంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక క్లాత్ హుండీల ద్వారా స్వామి వారికి భక్తులు కానుకల రూపంలో రూ.7,12,789 సమర్పించారని కార్యనిర్వహణాధికారి ఆళ్ల శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. కానుకలను సోమవారం లెక్కించారు. హుండీ లెక్కింపులో దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, సభ్యులు వై.మాధవి, వి.పద్మజ, వి.శ్రీనివాసులు, ఈ.దొరస్వామి భక్తులు, విశ్రాంత ఎస్‌బీఐ ఉద్యోగులు, సంతపేట ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. లెక్కింపును పూడిపర్తి రామలింగేశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎన్.శ్రీధర్‌నాయుడు పర్యవేక్షించారు.

పేదల జోలికొస్తే సహించేది లేదు

- నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు (బారకాసు): నెల్లూరు రూరల్ పరిధిలో పేద, మధ్య తరగతి ఇళ్లకు వచ్చి కరెంట్ కట్ చేస్తాం, ఇళ్లు ధ్వంసం చేస్తాం అంటూ బెదిరిస్తే.. సహించేది లేదని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నగర పాలక సంస్థ అధికారులను హెచ్చరించారు. సోమవారం నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో జరిగిన ప్రజా విజ్ఞప్తుల కార్యక్రమంలో కమిషనర్ సూర్యతేజ, ఇతర అధికారులతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రజలు అందజేస్తున్న అర్జీల ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ మధ్య తరగతి కుటుంబాల విషయంలో చిన్న పొరపాటు జరిగినా తాను సహించేది లేదన్నారు. కొంత మంది అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ సామాన్య ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని, అలాంటి వేషాలు చెల్లవని హెచ్చరించారు. అధికారులు ఎవరి కళ్లల్లోనో ఆనందం కోసం అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. కానీ తనతో తమాషాలాడొద్దని, ఒక వేళ ఎవరైనా అలా ప్రవర్తిస్తే.. నేను వీధుల్లోకి వచ్చిన రోజు వాళ్లను ఎవరూ కాపాడలేరని హెచ్చరించారు.

సిఫార్సు లైసెన్స్‌లకు చెక్



ట్రాక్ వద్ద సీసీ కెమెరాలు, సెన్సార్ల మధ్యలో వాహనదారుడు

డ్రైవింగ్ లైసెన్స్ పొందాలంటే.. బైక్, కారు డ్రైవ్ చేయడం వస్తే చాలదు. క్లిష్టమైన రహదారిలో కూడా కచ్చితమైన డ్రైవింగ్ చేయగలిగితేనే లైసెన్స్‌లు జారీ చేస్తారు. మనీ, మనుషుల సి'ఫార్సు' లైసెన్స్‌లకు చెక్ పెడుతూ ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ సిద్ధమైంది. నెల్లూరులో ఇకపై సెన్సార్లే.. లైసెన్స్‌లు జారీ చేస్తాయి. టెస్ట్ ట్రాక్‌లో బైక్ డ్రైవింగ్‌లో కచ్చితమైన నిబంధనలు పాస్ అవ్వాల్సిందే. కాలు కింద పెట్టినా.. పక్కన ఏర్పాటు చేసిన సెన్సార్లకు తగిలినా.. ఫెయిలే. అత్యాధునిక టెక్నాలజీతో పూర్తి చేసిన ఈ ట్రాక్ నిర్మాణానికి గత ప్రభుత్వంలోనే శ్రీకారం జరిగింది. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి ఈ ప్రక్రియ ద్వారానే లైసెన్స్‌లు జారీ కానున్నాయి.

నెల్లూరులో ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ రెడీ

- వచ్చే నెల 1వ తేదీ నుంచి ఈ టెస్ట్ డ్రైవ్ ద్వారానే లైసెన్స్‌లు
- డ్రైవింగ్ ట్రాక్‌లో 13 సెన్సార్లు, 14 వీడియో కెమెరాలు, 8 వీఎంఎస్ బోర్డులు
- ట్రాక్ రోడ్డులో సెన్సార్లతో కూడిన బుల్లెట్ల ఏర్పాటు
- రోజుకు 50 నుంచి 60 లైసెన్స్‌లే జారీ
- ఈ ప్రక్రియపై నిపున్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ పర్యవేక్షణ
- బైక్‌పై నుంచి కాలు కింద పెట్టినా ఫెయిలే



ట్రాక్‌లో సెన్సార్ సిస్టం

నెల్లూరు (టౌన్): డ్రైవింగ్ లైసెన్స్ జారీలో సిఫార్సులకు చెక్ పడనుంది. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి నెల్లూరు నగరంలో ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ ద్వారా లైసెన్స్‌లు జారీ చేయనున్నారు. ఇందుకు సంబంధించి ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ నిర్మాణ సిద్ధమైంది. ఇప్పటి వరకు మొక్కుబడిగా డ్రైవింగ్ చేసినా, ఎవరైనా సిఫార్సు చేసినా, డబ్బులిచ్చినా లైసెన్స్ జారీ చేస్తున్న పరిస్థితి ఉంది. ఇక నుంచి ఈ పప్పులు ఉడకవు. కారు, బైక్‌ను, ఆటోను కచ్చితంగా డ్రైవింగ్ చేస్తేనే లైసెన్స్ జారీ అవుతుంది. ట్రాక్‌లో డ్రైవింగ్ చేసే సమయంలో బైక్‌పై నుంచి కాలు కింద పెట్టినా సెన్సార్లు ఫెయిల్ చేస్తాయి.

రూ.1.21 కోట్లతో నిర్మాణం

నెల్లూరులో అత్యాధునిక ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ నిర్మాణ పనులకు గత ప్రభుత్వంలోనే శ్రీకారం జరిగింది. ఈ ట్రాక్ నిర్మాణానికి రూ.1.21 కోట్లు గత ప్రభుత్వం మంజూరు చేసింది. పనులను హైదరాబాద్‌కు చెందిన నిపున్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అప్పగించారు. ట్రాక్‌ను 8, హెచ్, అప్‌గ్రేడ్‌మెంట్, పార్లర్ పార్కింగ్ తదితర ఆకారాల్లో నిర్మాణం చేపట్టారు. డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్‌లో 13 సెన్సార్లు, 14 వీడియో కెమెరాలు, 8 వీఎంఎస్ బోర్డులు ఏర్పాటు చేశారు. వీటితో పాటు సెన్సార్లతో కూడిన బుల్లెట్లను వాహనం తిరిగే రోడ్లపై పదుల సంఖ్యలో ఏర్పాటు చేశారు. రోడ్లపై గుంతలు, ఎగుడు దిగుడు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

లైసెన్స్ జారీ ప్రక్రియ ఎలా అంటే..

నెల్లూరు నగరంలోని రవాణా కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద కియోస్క్ మెషీన్‌ను ఏర్పాటు చేయనున్నారు. లైసెన్స్ కోసం వచ్చిన వాహనదారుడు కియోస్క్ మెషీన్‌లో వేలి ముద్ర వేయగానే టోకెన్ వస్తుంది. ఆ టోకెన్‌తో డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లోకి వెళ్లాల్సి ఉంది. బైక్, కారు, ఆటోలకు ట్రాక్ ప్రారంభంలో ఒకే దారి ఉంటుంది. అక్కడ నుంచి కొంచెం దూరం వెళ్లిన తర్వాత బైక్, కారు రూట్లను సిగ్నల్స్ ద్వారా చూపిస్తారు. ట్రాక్ ప్రారంభంలో సెన్సార్ ఉంటుంది. సెన్సార్ వద్దకు వెళ్లి టోకెన్‌ను స్కాన్ చేసినట్లయితే ట్రాక్‌పై బిగించిన వీఎంఎస్ బోర్డుపై గ్రీన్ సిగ్నల్ వస్తుంది. దరఖాస్తు ప్రక్రియలో ఏమైనా లోపం ఉంటే రెడ్ సిగ్నల్ వస్తుంది. గ్రీన్ సిగ్నల్ వచ్చిన వాహనదారుడు సూచిక బోర్డుల ఆధారంగా వాహనాన్ని డ్రైవింగ్ చేయాల్సి ఉంటుంది. రోడ్డుపై ఏర్పాటు చేసిన సెన్సార్లు, బుల్లెట్లకు కాలు తగిలినా లేదా కాలు కింద పెట్టినా ఆ ప్రాంతంలో ఏర్పాటు చేసిన వీఎంఎస్ బోర్డులో ఫెయిల్ అని వస్తుంది. పర్‌ఫెక్ట్‌గా డ్రైవింగ్ చేసినట్లయితే పాస్ అని వస్తుంది. లేదంటే మళ్లీ డ్రైవింగ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. డ్రైవింగ్‌ను ట్రాక్ ఎదురు గదిలో ఉన్న ఎంవీఐతో పాటు ప్రైవేట్ కంపెనీకి చెందిన ప్రతినిధులు పరిశీలిస్తుంటారు. ఈ ప్రక్రియలో రోజుకు 50 నుంచి 60 మందికి లైసెన్స్‌లు జారీ చేస్తారు. లైసెన్స్ కోసం ముందుగా ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది.



ట్రాక్‌పై కెమెరాలు, సెన్సార్లను పర్యవేక్షిస్తున్న అధికారి

డ్రైవింగ్‌పై పూర్తి అవగాహన కల్పనకే..

చాలా మందికి లైసెన్స్ ఉన్నప్పటికీ కనీసం రహదారి నిబంధనలు కూడా తెలియడం లేదు. ప్రధానంగా డ్రైవింగ్ సమయంలో బ్యాలెన్స్ చేయలేకపోవడం, ఓవర్ స్పీడ్, ర్యాష్ డ్రైవింగ్, మలుపుల సమయంలో ఇండికేటర్లు సరిగా ఉపయోగించకపోవడం, ఓవర్ టేక్, సిగ్నల్స్‌ను పాటించకపోవడం వంటివి ఎక్కువగా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రధాన రహదారుల్లో ప్రమాదాల సంఖ్య భారీగా పెరుగుతోంది. ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లో లైసెన్స్‌ల జారీతో ప్రమాదాలకు చెక్ పెట్టవచ్చని రవాణా అధికారులు చెబుతున్నారు.



డ్రైవింగ్ లైసెన్స్ ట్రాక్‌పై ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

ఫిబ్రవరి 1 నుంచి జారీ చేస్తాం




ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్ ద్వారానే వచ్చే నెల 1వ తేదీ నుంచి లైసెన్స్‌లను జారీ చేస్తాం. ప్రతి ఒక్కరూ పూర్తిగా డ్రైవింగ్ నేర్చుకున్న తర్వాతనే లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలి. చిన్న తప్పు చేసినా ఫెయిల్ అవుతారు. ఫెయిల్, పాస్ అనేది ఎవరి చేతుల్లో ఉండదు. డ్రైవింగ్ విధానాన్ని బట్టి ట్రాక్‌లో ఏర్పాటు చేసిన వీడియో కెమెరాలు, సెన్సార్లు నిర్ణయిస్తాయి. వాహనాన్ని లైసెన్స్‌కు వచ్చిన వారే తెచ్చుకోవాల్సి ఉంది.

– బి.చందర్, ఉప రవాణా కమిషనర్, రవాణా శాఖ

కార్పొరేషన్ అడ్డాగా పవర్ పాలిట్రిక్స్

మంత్రి నారాయణ పవర్ పాలిటిక్స్‌తో ఆ పార్టీలో అలజడి రేగుతోంది. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కాక ముందే.. ఆ పార్టీ నేతల మధ్య రాజకీయ వైషమ్యాలు బట్టబయలవుతున్నాయి. కొద్ది నెలలుగా నెల్లూరు కార్పొరేషన్ అడ్డాగా జరుగుతున్న పవర్ పాలి'ట్రిక్స్' బ్లాస్ట్ అవుతున్నాయి. నగరపాలక సంస్థలో మంత్రి ఆధిపత్యాన్ని విభేదిస్తున్న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి తాజాగా సినిమా మాస్ డైలాగ్‌లతో పరోక్షంగా నారాయణకే మాస్ వార్నింగ్‌లు ఇచ్చారు. తాను రోడ్డెక్కితే తట్టుకోలేరంటూ అటు మంత్రికే కాకుండా నగర పాలక సంస్థల అధికారులను హెచ్చరిస్తూ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సింహపురి రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

- కార్పొరేషన్‌లో ఆధిపత్యానికి అంతర్యుద్ధం
- మంత్రి నారాయణ నిర్ణయాలను విభేదిస్తున్న ఎమ్మెల్యే
- సినిమాటిక్ మాస్ డైలాగ్‌లతో కోటంరెడ్డి హడావుడి
- నేను రోడ్డెక్కితే తట్టుకోలేరంటూ మాస్ వార్నింగ్



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్ నియోజకవర్గాలకు పాలన, అభివృద్ధి కేంద్రంగా ఉన్న నగరపాలక సంస్థ.. అధికార పార్టీ నేతల మధ్య ఆధిపత్యానికి అడ్డాగా మారింది. ఇప్పటి వరకు జరుగుతున్న అంతర్యుద్ధం.. ఇక బహిరంగ యుద్ధంగా మారినట్లు కనిపిస్తోంది. నెల్లూరు సిటీ నియోజకవర్గం నుంచి గెలిచిన పొంగూరు నారాయణ.. మున్సిపల్‌శాఖ మంత్రి కావడంతో నెల్లూరు కార్పొరేషన్‌లో పట్టు సాధించేందుకు పవర్ పాలిటిక్స్‌కు తెరతీశారు. నగరపాలక సంస్థ పరిధిలో నెల్లూరు నియోజకవర్గం ఉన్నప్పటికీ అక్కడి స్థానిక ఎమ్మెల్యే ప్రమేయం లేకుండా.. మున్సిపల్ శాఖ మంత్రిగా నారాయణ ఏకపక్ష నిర్ణయాలతో పవర్ పాలి'ట్రిక్స్'కు బీజం వేశారు. మంత్రి నారాయణ.. తీసుకుంటున్న నిర్ణయాలు కార్పొరేషన్ పరిధిలోని నెల్లూరు సిటీ నియోజకవర్గ ప్రజలకే కాకుండా.. రూరల్ నియోజకవర్గ ప్రజలకు కంటగింపుగా మారాయి. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి మంత్రి నారాయణ నిర్ణయాలను, పవర్ పాలి'ట్రిక్స్'తో తీవ్రంగా విభేదిస్తున్నారు. తాజాగా సోమవారం కార్పొరేషన్ కార్యాలయానికి వెళ్లి నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఎవరు వేలు పెట్టినా సహించబోమని నా పవర్ ఏమిటో చూపిస్తానంటూ అధికారులకు మాస్ వార్నింగ్ ఇస్తూనే పరోక్షంగా మంత్రికి కూడా మాస్ వార్నింగ్ ఇవ్వడం చూస్తే.. మంత్రితో ప్రత్యక్షంగా తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమయ్యాడనే సంకేతాలు కనిపిస్తున్నాయి.

ఆధిపత్యమా?.. పవరా?

నారాయణ తన శాఖ పరిధిలో ఉన్న నెల్లూరు కార్పొరేషన్‌ను తన అధీనంలో ఉంచుకున్నాడు. మంత్రి కావడంతో కార్పొరేషన్ అధికారులు సైతం ప్రొటోకాల్ ప్రకారం మంత్రి ఆదేశాలకే విలువిస్తున్నారు. పన్నులు వసూళ్ల వ్యవహారం నుంచి బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్స్ అంతా కూడా రూరల్ ఎమ్మెల్యేతో సంబంధం లేకుండానే పని కానిచ్చేలా చేస్తున్నారు. గతంలో కార్పొరేషన్‌లో ఏ చిన్న పని కావాలన్నా స్థానిక ఎమ్మెల్యేను ఆశ్రయించేవారు. ప్రస్తుతం రాజకీయ నేతలకు సంబంధం లేకుండానే అన్ని పనులు అధికారుల ద్వారా చక్కబెడుతున్నారు. ఈ విధానం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డికి నచ్చలేదు. ఇప్పటికే నాలుగు దఫాలుగా మంత్రికి వివిధ రకాలుగా వార్నింగ్‌లు ఇచ్చినా చెవికెక్కించుకోలేదు. ప్రత్యేకించి నగర కార్పొరేషన్‌లో జరిగే సమీక్ష సమావేశాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం లేకపోవడం వివాదానికి మరింత ఆజ్యం పోసింది.

విభేదాలకు కారణాలివే..

- నగరంలో పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన వారు పన్నుల బకాయిలు చెల్లించకుంటే ఇంటి ముందు డప్పుమోత, ఇంటి గేటుకు తాళాలు వేయడం, విద్యుత్ కనెక్షన్ కట్ చేయడం వంటి నిర్ణయాలు తీసుకోవడం.
- ఉద్యోగులు, అధికారుల బదిలీల్లో ఎమ్మెల్యే మాట చెల్లుబాటు కాకపోవడం.
- నెల్లూరు రూరల్ పరిధిలో ఎక్కువగా ఉన్న అనధికార లే అవుట్లకు సంబంధించిన వాటిపై కత్తి పెట్టి వాటి రిజిస్ట్రేషన్లు నిలిపివేయడం, విద్యుత్ కనెక్షన్లు నిలిపివేయాలనే ఆదేశాలు. ఆయా లేఅవుట్లు కూడా పాతవి కావడంతో పాటు యజమానులు సైతం స్థానిక ఎమ్మెల్యేకు అనుచరులు కావడం.
- భవన ప్లానింగ్ విషయంలో రాజకీయ నేతల ప్రమేయం లేకుండానే నేరుగా అప్రూవల్ ఇవ్వడం.
- అప్రూవల్ లేని భవంతులను నిబంధనలకు విరుద్ధంగా ఏకపక్షంగా కూల్చి వేయడం తదితర కారణాలతోనే ఆ ఇద్దరి మధ్య విభేదాలకు కారణమని ఆ పార్టీ శ్రేణులే చెబుతున్నాయి.

పుష్ప సినిమా మాస్ డైలాగ్‌లతో వార్నింగ్‌లు

ఇప్పటికే నాలుగు నెలలుగా మంత్రి, ఎమ్మెల్యే మధ్య అంతర్యుద్ధం జరుగుతోంది. ఈ పరిస్థితి శ్రుతిమించడంలో తాడోపేడో తేల్చుకునేందుకు కోటంరెడ్డి సిద్ధపడ్డాడు. మంత్రి పదవి ఆశించిన ఎమ్మెల్యే కోటంరెడ్డికి పదవి రాకుండా నారాయణ అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నాడన్న రాజకీయ ప్రచారం వారిద్దరి మధ్య అగాధం పెంచింది. ఓ వైపు కార్పొరేషన్‌లో పెత్తనం లాగేసుకోవడం, తన చిరకాల వాంఛగా ఉన్న మంత్రి పదవి దూరమయ్యే అవకాశం కనిపిస్తుండడంతో మంత్రిపై ప్రత్యక్ష యుద్ధానికి కాలు దువ్వేందుకు సిద్ధమైనట్లుగా తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఆయన నెల్లూరు కార్పొరేషన్‌లో సోమవారం మాస్ డైలాగ్‌లతో ప్రత్యక్షంగా అధికారులకు, పరోక్షంగా మంత్రికి వార్నింగ్ ఇచ్చారు. మీడియాతో మాట్లాడుతూ పుష్ప సినిమాలో ఓ పోలీస్ అధికారి డైలాగ్‌తో కార్పొరేషన్‌లో ఒక్కటి తగ్గిందంటూ.. మాస్ డైలాగ్‌లు వదిలారు. కిందల్ పడొద్దు.. వేషాలు వేయొద్దు.. తమాషాలు చేయొద్దంటూనే.. నేను రోడ్డెక్కితే మీరు తట్టుకోలేరంటూ మాస్ వార్నింగ్‌లు ఇవ్వడం సంచలనంగా మారింది.

నారాయణ పాలి'ట్రిక్స్' బెడిసికొడతాయా?

విద్యాసంస్థల అధినేతగా, వ్యాపారవేత్తగా రాజకీయ ఎంట్రీ ఇచ్చిన పొంగూరు నారాయణ టీడీపీలో కీలక నేతగా ఉన్నారు. గతంలో ఎమ్మెల్సీగా ఎన్నికై.. మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖల మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అప్పట్లో నారాయణ పవర్ పాలిటిక్స్‌కు దూరంగా ఉన్నారు. కానీ ఈ దఫా ప్రత్యక్ష బరిలో దిగి ఎన్నికైన నారాయణ అదే మంత్రిత్వ పదవులు దక్కించుకున్నారు. ఇప్పుడు ఆయన పొలిటికల్ ట్రెండ్ మార్చేశారు. పవర్ పాలిటిక్స్‌తో పట్టు సాధించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే జిల్లాలో పవర్ పాలిట్రిక్స్‌లో ఆరితేరిన మరో మంత్రి ఆనంతోపాటు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి ఉన్నారు. రాజకీయాల్లో దక్కాముక్కిలైన వీరిని తట్టుకుని ఎంత వరకు రాణించగలరనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.



కూల్చివేసిన ఇంటిని పరిశీలించి బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

వైఎస్సార్‌సీపీ నేతలే టార్గెట్

- కావాలనే ఇబ్బంది పెడుతున్నారు
- నిర్మాణాలూ కూల్చివేస్తున్నారు
- ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ నేతలను టార్గెట్ చేసి.. వారిపై దౌర్జన్యాలకు పాల్పడుతోందని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఎన్ఎంసీ అధికారులు అక్రమ కట్టడం అంటూ నగరంలోని బాలాజీనగర్, చీపురుకట్ట సంఘం ప్రాంతంలోని వైఎస్సార్‌సీపీ నేత బాలకృష్ణారెడ్డికి చెందిన భవనాన్ని సోమవారం కూల్చివేశారు. దీంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పర్వతరెడ్డి మాట్లాడుతూ నెల్లూరులో మంత్రి నారాయణ అధికారుల ద్వారా వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తల ఇళ్లపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బాలకృష్ణారెడ్డి కొత్తగా నిర్మించుకున్న ఇంటిని అక్రమ నిర్మాణం అంటూ మంత్రి ఆదేశాల మేరకు అధికారులు కూల్చి వేయడం ఏమిటని ప్రశ్నించారు. సంక్షేమ పాలన అందిస్తారని భావించి కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు అధికారంలోకి తీసుకువస్తే నెల్లూరులో ప్రజల ఇళ్లను కూల్చివేసి వారి దుఃఖానికి కారణం అవుతున్నారన్నారు. మంత్రి నారాయణ, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిలకు ఇది తగదని, ఇలాంటి చర్యలను ప్రజలు ఉపేక్షించరని అన్నారు. ఎల్లకాలం టీడీపీ అధికారంలో ఉండదని వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తుందని అప్పుడు టీడీపీ నేతలు వాళ్ల కార్యకర్తలను కాపాడుకోగలరా అని ప్రశ్నించారు. ఇటువంటి దౌర్జన్యాలు పునరావృతమైతే రాబోయే రోజుల్లో టీడీపీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన యువతతో ఆనం విజయకుమార్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ తదితరులు

నెల్లూరు(బారకాసు): నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో అధికార టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు జరిగాయి. సోమవారం చింతారెడ్డిపాళెంలోని ఆనం విజయకుమార్‌రెడ్డి నివాసంలో 30వ డివిజన్ యువ నాయకుడు వీరప్పరెడ్డి ప్రవీణ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నుంచి 200 మంది యువత వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరందరికీ ఆనం విజయకుమార్‌రెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ మదన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాస్‌రావు(ఆర్ఎస్ఆర్), నారాయణరెడ్డి, నవీన్ రెడ్డి, ఇక్బాల్, మహిళా నాయకురాలు రోజారాణి, వాసంతితో పాటు 30వ డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాళ్లరిగేలా తిరుగుతున్నా..

- మళ్లీ రికార్డు స్థాయిలో అర్జీలు
- గత వారం 405, ఈ వారం 407
- మండలాల్లో పరిష్కారం కాకపోవడం వల్లే ఈ పరిస్థితి
- ఆడిట్ చేసేందుకు అధికారులను నియమించినా కనిపించని పురోగతి
- కలెక్టర్ ఆదేశిస్తున్నా సిబ్బందిలో నిర్లిప్తత



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్, అధికారులు

నెల్లూరు రూరల్: జిల్లా కేంద్రంలో ప్రతి వారం జరుగుతున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రికార్డు స్థాయిలో అర్జీలు వస్తున్నాయి. కాళ్లరిగేలా తిరుగుతున్నా ప్రయోజనం ఉండటం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సోమవారం కూడా 407 మంది కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణానికి విచ్చేసి తమ సమస్యలపై అర్జీలను అందజేశారు. కలెక్టర్ ఆనంద్, జాయింట్ కలెక్టర్ కార్తీక్, డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, జెడ్పీ సీఈఓ విద్యారమ, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి సమస్యలు తెలుసుకున్నారు. అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించి 157 వినతులు వచ్చాయి. మున్సిపల్ శాఖవి 32, పోలీస్ శాఖవి 63, సర్వేవి 35, పంచాయతీరాజ్ శాఖవి 27, సివిల్ సప్లయీస్ విభాగానికి సంబంధించి 10 తదితర అర్జీలు అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వినతులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని, వాటిని పరిష్కరించే దిశగా అధికారులు శ్రద్ధ పెట్టాలన్నారు.

శ్మశానవాటిక ఏర్పాటు చేయాలంటూ..

రాపూరు మండలం గుండవోలు గ్రామ కండలేరు పునరావాస కేంద్రంలో ఎస్సీ, ఎస్టీలకు శ్మశానవాటిక ఏర్పాటు చేయాలని కోరుతూ యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్మశానవాటిక విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మానికల మురళి, చెంబేటి ఉష, నాగరాజు, గోపీ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవినీతి

కలువాయి మండలం కుల్లూరు గ్రామంలో ఉపాధి జాబ్ కార్డు మంజూరుకు సంబంధించి జరిగిన అవకతవకలపై తగిన చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ జిల్లా కమిటీ మాజీ సభ్యుడు కొప్పాల రఘు అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఎస్సీ పేరుతో కార్డు తీసుకుని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో కొత్త ఖాతా సృష్టించి అందులోకి నిధులు దారి మళ్లించి దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించారు. బోగస్ జాబ్‌కార్డులు సృష్టించిన ఫీల్డ్ అసిస్టెంట్, ఏపీఓ, ఎంపీడీఓ, ఏపీడీలపై క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు.

అక్రమ కట్టడాన్ని తొలగించాలి

అక్రమ కట్టాడన్ని తొలగించాలని బీజేపీ నాయకుడు మిడతల రమేష్ డిమాండ్ చేశారు. అధికారులకు వినతి పత్రం సమర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని వవ్వేరు గ్రామంలో కనిగిరి రిజర్వాయర్ స్థలంలో టీడీపీకి చెందిన ఓ వ్యక్తి 150 అంకణాల భారీ భవనాన్ని నిర్మించారన్నారు. అక్రమ కట్టడాన్ని ఎమ్మెల్యే సహకారంతో చర్చి కింద మార్చేసి రాజకీయ ముసుగులో దానిని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో రఘురామయ్య, కరుణ, సుభాషిణి, నాగలక్ష్మి, సుజన, వీరరాఘవులు, అలూరు నాగేంద్రసింగ్, పద్మ, విజయలక్ష్మి, ఏవీ సుబ్బయ్య, నారాయణ యాదవ్, పైడిమాని ఆదినారాయణ, చింతగింజల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

మరికొన్ని..

- వింజమూరులో సర్వే నంబర్ 775లో ఉన్న 6 అంకణాల స్థలాన్ని ఆక్రమించారని వింజమూరు రెండో సెగ్మెంట్ ఎంపీటీసీ సభ్యుడు పల్లాల కొండారెడ్డి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ చిన్నపాటి వర్షం కురిసినా కూడా నీరు నడిమూరు ప్రాంతంలోని ఇళ్లలోకి ప్రవేశించి ప్రజలకు తీవ్ర నష్టం చేస్తుందని తెలిపారు. వాగును పూడ్చి చిన్నపాటి పైపులైన్ నిర్మించేందుకు పలు శాఖల అధికారులు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు సహకరిస్తున్నారని ఆరోపించారు.
- పుల్లనీళ్లపల్లి గ్రామంలో ఎస్సీలు, బీసీలకు గతంలో ఇచ్చిన 10.86 ఎకరాలను ఆక్రమించారని అధికారులకు వినతిపత్రం అందింది. రీసర్వే చేసే క్రమంలో అధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చి కొమ్మి సిద్దులునాయుడు తన కుటుంబీకుల పేర్ల మీద రికార్డులను మార్చుకుని దారిని సైతం మూసేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని రైతులు తెలిపారు. సుబ్బనాగయ్య, ప్రదీప్, ప్రవీణ్, కృష్ణయ్య, పెంచలయ్య పాల్గొన్నారు.

నారాయణను మంత్రి పదవి నుంచి తొలగించాలి



ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

'నారాయణ కళాశాలలో విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం బాధాకరం. వెంటనే నారాయణను మంత్రి పదవి నుంచి తొలగించాలి' అని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ కళాశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని, దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫీజులు తగ్గించాలన్నారు. ఒత్తిడి కారణంగా విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న కళాశాలలపై తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్ నాయకుడు అక్షిత్ రెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరేంద్ర, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మస్తాన్ షరీఫ్ పాల్గొన్నారు.

వెల్లువలా..



అర్జీల నమోదు కేంద్రం వద్ద ప్రజలు

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రజల నుంచి అర్జీలు వెల్లువలా వస్తున్నాయి. గత నెల వరకు ఆ సంఖ్య 300 వరకు ఉండగా ఈ నెలలో నాలుగు వందలు దాటింది. గత వారం 405 అర్జీలను అధికారులు స్వీకరించారు. ఈ వారం కూడా సంఖ్య పెరిగింది. మండలాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం మొక్కుబడిగా జరుగుతోంది. దీంతో జనం జిల్లా కేంద్రానికి వస్తున్నారు. అర్జీలను ఆడిట్ నిర్వహించేందుకు 19 మంది ఉన్నత స్థాయి అధికారులను నియమించినా ఉపయోగం లేకుండా పోయిందని విమర్శలున్నాయి. ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆనంద్ పదేపదే ఆదేశిస్తున్నా నిర్లక్ష్యంగా ఉంటుండటంతో వందల సంఖ్యలో వినతులు అందుతున్నాయి.

విద్యుత్ భవన్ ఎదుట ధర్నా



డీఈఈకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నెల్లూరులోని విద్యుత్ భవన్ ఎదుట సోమవారం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు దుగ్గిరాల సూరిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి సుమన్‌లు మాట్లాడుతూ సంస్థలో 23 వేల మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారని, వీరిని రెగ్యులర్ చేయాలని, సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టాలన్నారు. మీటర్ రీడర్స్, స్టోర్ హమాలీలు, బిల్ కలెక్షన్ ఏజెంట్లు, ఎస్పీఎం కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. రాజకీయ నాయకుల వేధింపులకు చెక్ పెట్టాలన్నారు. సమస్యలను పరిష్కరించకరించకపోతే విద్యుత్ భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం డీఈటీ శేషాద్రి బాలచంద్రకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కోశాధికారి పెంచలప్రసాద్, కోవూరు, నెల్లూరు, నాయుడుపేట, కావలి డివిజన్ నాయకులు దయాకర్, సునీల్, సుబ్రహ్మణ్యం, మనోహర్‌రెడ్డి, రామారావు, భాస్కర్, రమేష్, రవి, అబ్దుల్, వంశీ, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కనికరించండి.. న్యాయం చేయండి

- పోలీస్ శాఖలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'
- 80 అర్జీల అందజేత
- పరిష్కరిస్తామన్న ఎస్పీ కృష్ణకాంత్



బాధితురాలి సమస్య వింటున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైమ్): 'క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. మీరైనా కనికరించి న్యాయం చేయండి' అని పలువురు బాధితులు ఎస్పీ జి.కృష్ణకాంత్‌ను కోరారు. సోమవారం నెల్లూరు ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి 80 మంది విచ్చేసి తమ సమస్యలను వినతుల రూపంలో ఎస్పీకి అందజేశారు. వాటిని పరిశీలించిన ఆయన చట్టపరిధిలో నిర్ణీత వ్యవధిలో సమస్యలు పరిష్కరించాలని ఆయా ప్రాంత పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నగర, మహిళా డీఎస్పీలు పి.సింధుప్రియ, చెంచురామారావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

- నాకు నెల్లూరు రూరల్ మండలానికి చెందిన నవీన్‌తో పరిచయం ఉంది. దాన్ని అడ్డం పెట్టుకుని కొంతకాలంగా వివిధ రకాలుగా వేధిస్తున్నాడు. చంపుతానని బెదిరిస్తున్నాడు. అతడి బారి నుంచి రక్షణ కల్పించాలంటూ దర్గామిట్ట పరిధికి చెందిన ఓ మహిళ కోరారు.
- ఆసోంకు చెందిన మనోరంజన్ అమెరికాలో సాఫ్ట్‌వేర్ జాబ్ ఇప్పిస్తానని నమ్మించి రూ.5.50 లక్షలు తీసుకుని మోసగించాడు. విచారించి న్యాయం చేయాలని వేదాయపాళేనికి చెందిన ఓ యువకుడు అర్జీ ఇచ్చాడు.
- కుటుంబ కలహాల నేపథ్యంలో నా చిన్న కుమారుడు ఇబ్బంది పెడుతున్నాడు. అతడిపై చర్యలు తీసుకోవాలని కావలి రెండో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని ఓ వృద్ధురాలు వినతిపత్రం సమర్పించారు.
- భర్త, అత్తింటివారు అదనపుకట్నం కోసం వేధిస్తున్నారు. ఇటీవల నాతోపాటు పిల్లలపై దాడి చేసి ఇంటి నుంచి గెంటేశారు. వారిపై చర్యలు తీసుకోవాలని నెల్లూరు వేదాయపాళేనికి చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేశారు.
- నా భర్త మరణించారు. అప్పటి నుంచి అత్తమామలు వేధిస్తూ నన్ను, నా బిడ్డలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. విచారించి న్యాయం చేయాలని ఆత్మకూరుకు చెందిన ఓ మహిళ విజ్ఞప్తి చేశారు.
- గుడిపల్లిపాడుకు చెందిన మల్లికార్జున, యానాదయ్య, మణీంద్ర, సాయిదినేష్, వెంకటరమణ మరికొందరు ఈనెల 14వ తేదీన మారణాయుధాలతో మా ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి నాతోపాటు నా కుటుంబసభ్యులపై విచక్షణారహితంగా దాడి చేశారు. నెల్లూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాం. నిందితులపై చర్యలు తీసుకుని వారి బారి నుంచి రక్షణ కల్పించాలని గుడిపల్లిపాడుకు చెందిన అశోక్ కోరాడు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని జింక మృతి

- మరో జింకకు గాయాలు

వెంకటాచలం: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒక జింక మృతిచెందగా, మరొకటి గాయపడిన ఘటన మండలంలోని చెముడుగుంట సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం జరిగింది. వివరాలు.. దాహార్తి తీర్చుకునేందుకు రెండు జింకలు చెరువు వద్దకు వెళ్లేందుకు జాతీయ రహదారి దాటుతుండగా.. గూడూరు వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒక జింక చనిపోయింది. మరొకటి గాయాలపాలైన విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. జింకను చికిత్స నిమిత్తం తరలించారు.

రెండుచోట్ల పోక్సో కేసుల నమోదు

నెల్లూరు(క్రైమ్): మాయమాటలు చెప్పి ఒకరు, సాయం ముసుగులో మరొకరు బాలికతో అసభ్యంగా ప్రవర్తించారు. వారిపై నెల్లూరు సంతపేట పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. తిరుపతి జిల్లాకు చెందిన ఓ బాలిక నెల్లూరు నగరంలోని ఓ స్కూల్లో ఎనిమిదో తరగతి చదువుతూ హాస్టల్లో ఉంటోంది. స్కూల్ సమీపంలో ఉండే వ్యక్తి చాక్లెట్లు, ఐస్‌క్రీమ్స్ కొనిస్తూ దగ్గరయ్యాడు. ఈనెల 25వ తేదీన అతను బాలికను సౌత్ రైల్వేస్టేషన్ సమీపంలోకి తీసుకెళ్లి అసభ్యకరంగా ప్రవర్తిస్తుండగా ఓ యువకుడు పెద్దగా అరవడంతో పరారయ్యాడు. యువకుడు బాలిక వివరాలు సేకరించి హాస్టల్లో వదులుతానని ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. పాఠశాల నుంచి బాలిక వసతి గృహానికి రాకపోవడంతో వార్డెన్ ఆమె తల్లిదండ్రులకు తెలియజేశారు. వారు ఈనెల 26వ తేదీన నెల్లూరుకు చేరుకుని స్థానిక సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు బాలిక కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈక్రమంలో బాలిక ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఏడుస్తూ కనిపించడంతో పోలీసులు సంరక్షించారు. వివరాలు తెలుసుకుని మిస్సింగ్ కేసును పోక్సో కేసుగా మార్చారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

ప్రేమ పేరుతో..

వెంకటాచలం: 16 సంవత్సరాల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కనుపూరు గ్రామానికి చెందిన కృష్ణవంశీ అనే యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. కనుపూరు పంచాయతీ జ్యోతినగర్‌కు చెందిన కృష్ణవంశీ ఓ బాలికను ప్రేమిస్తున్నానంటూ నమ్మించి పలుమార్లు లైంగిక దాడి చేశాడు. ఆమె ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పదోన్నతులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ పరిధిలో జూనియర్ ఇంజినీర్లుగా ఉన్న పలువురు మహిళా అధికారులకు ఏఈలుగా పదోన్నతులు కల్పించారు. సోమవారం ఎస్ఈ విజయన్ నియామకపత్రాలను అందజేశారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.30
నన్నవి	: రూ.20
పండ్లు	: రూ.10

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 130
లేయర్ (లైవ్)	: 85
బ్రాయిలర్ చికెన్	: 230
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 254
లేయర్ చికెన్	: 145



కుమార్తెనిచ్చి పెళ్లి చేయలేదని..

- వ్యక్తి హత్య కేసును ఛేదించిన పోలీసులు



వివరాలను వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా

నెల్లూరు(క్రైమ్): ఇటీవల జరిగిన ఓ వ్యక్తి హత్య కేసులో నిందితుడిని నెల్లూరు నవాబుపేట పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ షేక్ అన్వర్‌బాషా తన కార్యాలయంలో వివరాలను వెల్లడించారు. జాకీర్ హుస్సేన్‌నగర్‌కు చెందిన షేక్ మహబూబ్‌బాషా (54), కరిమున్నీసాలు దంపతులు. వారికి ఒక కుమార్తె ఉంది. ఆమె అదే ప్రాంతానికి చెందిన షాహిద్ ప్రేమించుకున్నారు. దీంతో ఇరు కుటుంబాలు గతేడాది వారికి నిశ్చితార్థం చేశారు. షాహిద్ పనులు చేయకుండా జులాయిగా తిరుగుతుండటం, అతడిపై పోలీస్ కేసులున్నాయని తెలుసుకున్న మహబూబ్‌బాషా తన కుమార్తెనిచ్చి వివాహం చేసేందుకు నిరాకరించాడు. అప్పటి నుంచి షాహిద్ అతడిపై కక్ష పెంచుకున్నాడు. ఈ నెల 25వ తేదీ సాయంత్రం మహబూబ్‌బాషా శ్రీనివాసనగర్ మీదుగా స్కూటీపై వెళ్తుండగా షాహిద్ తన స్కూటీతో ఢీకొట్టాడు. షాహిద్ తన వెంట తెచ్చుకున్న కత్తితో మహబూబ్‌బాషాపై దాడి చేసి పరారయ్యాడు. గాయపడిన అతడిని స్థానికులు చికిత్స నిమిత్తం డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందాడని నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ హత్య కేసు నమోదు చేశారు. సోమవారం ఎఫ్‌సీఐ కాలనీ వద్ద నిందితుడిని అరెస్ట్ చేసి హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నామని ఇన్‌స్పెక్టర్ చెప్పారు. సమావేశంలో ఎస్సై షేక్ రహిమాన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.